క్లుప్తంగా

కాశీవిశ్వేశ్వరాలయంలో చండీహోమం



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులోని శ్రీఅన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం చండీహోమం నిర్వహించారు. అర్చకులు కె. పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. విశేష కార్యక్రమాల అనంతరం స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మాదల(ముప్పాళ్ల): పాఠశాలలోని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ మేరకు అందించాలని ఎంఈఓ ఒంగోలు రాజు చెప్పారు. మండలంలోని మాదలలోని ఎంపీపీ(జీ.పీ)స్కూలును సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రిజిస్ట్రార్‌ను పరిశీలించారు. జేవీకే కిట్లు, యూనిఫాం, పుస్తకాలు పంపిణీని పరిశీలించారు. మారిన మెనూ ప్రకారం ఆహారం అందించాలని నిర్వాహకులను కోరారు. ఆహారాన్ని రుచి చూసిన తర్వాత విద్యార్థులకు అందించాలని ప్రధానోపాధ్యాయురాలు ప్రవీణ కు సూచించారు.

ఎంఈఓ-1 గా శ్రీనివాసరావు

అచ్చంపేట: మండల విద్యాశాఖాధికారి-1గా మేడా శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలసి అభినందలు తెలిపారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులంతా పనిచేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆశయాలను నెరవేర్చాలన్నారు. అభినందించిన వారిలో ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు జి.గంగయ్య, వీరవాసు, సొరెడ్డి, ఎం.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు, వాసుబాబు, రాంబాబు, సత్యనారాయణ, మరియమ్మ, సుజాత పాల్గొన్నారు.

ఏపీ విపత్తుల ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌కు డాక్టరేట్



తాడేపల్లిరూరల్: ఏపీ విపత్తుల సంస్థలో ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న బాలిబోయిన ప్రసాద్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏపీ విపత్తుల సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ తమ సంస్థలో ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ప్రసాద్ రిమోట్ సెన్సింగ్, భౌగోళిక సమాచార వ్యవస్థ ఉపయోగించి కృష్ణా, గుంటూరు జిల్లాల భౌతిక, సామాజిక దుర్బలత్వం, వరద విపత్తుల అంచనా అనే అంశంపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పర్యావరణ శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ పి.బ్రహ్మాజీరావు మార్గదర్శకత్వంలో రీసెర్చ్ చేశారని అన్నారు. విపత్తుల సంస్థలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంశాలపై పరిశోధన చేసిన అధికారుల సంఖ్య ఐదుకు చేరిందన్నారు. ప్రసాద్‌ను విపత్తుల సంస్థ ఈడీ సి.నాగరాజు, డాక్టర్ ఎం.ఎం.ఆలీ, డాక్టర్ పూర్ణచంద్, డాక్టర్ బాలకృష్ణ, శాంతిస్వరూప్ ఇతర సిబ్బంది అభినందించారు.

మార్కెట్ యార్డులో ధాన్యం బస్తాలు చోరీ

పిడుగురాళ్ల: మార్కెట్‌యార్డులో రైతు ధాన్యం బస్తాలు చోరీకి గురైనట్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు అయింది. పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన వల్లభనేని శివకుమార్ గత రెండు నెలల క్రితం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఓపెన్ షెడ్‌లో 620 ధాన్యం బస్తాలను నిల్వ చేశాడు. ప్రతి రెండు రోజులకు ఒకసారి ధాన్యం బస్తాలను చూసుకుంటూ వెళ్లేవాడు. ఈ క్రమంలోనే సోమవారం ధాన్యం బస్తాలను పరిశీలించడంతో 45 ధాన్యం బస్తాలు తగ్గాయి. ఎవరో దుండగులు ధాన్యం బస్తాలు దొంగలించారని గుర్తించిన వల్లభనేని శివకుమార్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రైతు ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

జగనన్న సురక్ష పేదలకు రక్ష

సత్తెనపల్లి(ముప్పాళ్ల): జగనన్న సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు రక్షణగా నిలుస్తోందని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ అన్నారు. పట్టణంలోని 14వ సచివాలయం వెంగళరెడ్డినగర్ పరిధిలోని 11,12 వార్డుల్లో జగనన్న సురక్ష శిబిరాలు సోమవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సాంకేతిక సమస్యలతో సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించడటంతో పాటుగా ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందించే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా 1427 గృహాలకు గాను 977 గృహాల సర్వే చేసి 210 టోకెన్‌లు అందించామని వివరించారు. వాటిల్లో 196 సర్టిఫికెట్లు ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గుజ్జర్లపూడి సతీష్, లోకకళ్యాణి మాధవ్, కో ఆప్షన్ మెంబర్ మౌలాలి, అచ్యుత శివప్రసాద్, శిరిగిరి వెంకట్రావు, పెద్దింటి వెంకటేశ్వర్లు, మల్లికార్జునరెడ్డి, తుమ్మల వెంకటేశ్వర్లు, రేపూడి రవితేజ, వల్లెం నరసింహారావు, యూనస్, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు పాల్గొన్నారు.



పట్టణంలో అర్హులకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న కమిషనర్ షమ్మీ

ఎండ్రాయిలో..

అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయిలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ మాధురి అధ్యక్షత వహించారు. మొత్తం 321 ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకోగా 317 పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, ఎండ్రాయి సర్పంచి నాయుడు రాంబాబు, చావపాడు సర్పంచి చిలకా ఆనందరావు, డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిలకా సాంబయ్య, నాయుడు సాంబశివరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

నకరికల్లు: స్థానిక సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మేచారపు అనూరాధ, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుసేన్‌బీ బాషా, మండల కో ఆప్షన్ సభ్యుడు డాక్టర్ షేక్ హుసేన్, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏఓ కె.దేవదాసు, ఈఓపీఆర్డీ గిరిధర్, కార్యదర్శులు భావన్నారాయణ, సైదారెడ్డి, మారెళ్ల శ్రీనివాసరావు, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, సలీల్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పరసా సాంబయ్య పాల్గొన్నారు.



ఎండ్రాయిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం



రాజుపాలెంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు

ఇంటింటా సర్వే..

రాజుపాలెం: మండలంలోని ఇనిమెట్లలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు సోమవారం ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. గ్రామంలో జరిగే జగనన్న సురక్ష క్యాంప్‌లో అధికారులందరు హాజరవుతున్నందున సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు వివరించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

సత్తెనపల్లి(ముప్పాళ్ల): మణిపూర్‌లో జరుగుతున్న హింసకు నిరసనగా సోమవారం పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సత్తెనపల్లి నియోజకవర్గ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్, యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం సభ్యులు స్థానిక తాలుకా సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న యూపీఎఫ్ ఫౌండర్ రెవ.గోళ్లమూడి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ దాడుల్లో అనేక ప్రార్థనా మందిరాలు ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. వందల కుటుంబాలు అడవుల్లోకి చెదిరిపోయి రాష్ట్ర సరిహద్దులు దాటి తలదాచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు రెవ. ఐ.డేవిడ్‌రాజు, ఉపాధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, కార్యదర్శి రెవ. బి.ఎస్.రావు, జాయింట్ సెక్రటరీ రెవ.యు.ప్రభాకరరావు, ట్రెజరర్ రెవ. ఎస్.సత్యానందం, సభ్యులు కె.పూర్ణచంద్రరావు, లివింగ్‌స్టన్, బి.భాస్కరరావు, ఏసుదానం, వి.సంతోష్‌వర్మ, పి.చిన్నమోషే పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

శ్రీకృష్ణభగవానుడికి పూజలు

రాజుపాలెం: ఆషాఢ మాసంలో వస్తున్న గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని చౌటపాపాయపాలెం, అనుపాలెం, అంచులవారిపాలెం, కొత్తబోధనం గ్రామాలలో నరసరావుపేటకు చెందిన త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి హిందూజ్ఞాన వేదికకు చెందిన కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవత్‌గీత ప్రచార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు గడియం పెద్దరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నమెంటు

తెనాలి: స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ, తెనాలి ఆధ్వర్యంలో డబుల్‌హార్స్ మినపగుళ్ల సౌజన్యంతో స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ ఇండోర్ స్టేడియంలో రెండురోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు ఆదివారం సాయంత్రం ముగిసింది. ఆంధ్రాప్యారిస్ కప్ పేరుతో నాలుగు కేటగిరీల్లో ఈ పోటీలు పోటాపోటీగా సాగాయి. ముగింపు సభలో డబుల్‌హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ జి.సాయిరేవతి, ఏలూరు స్పోర్ట్స్ అధికారి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ సాంబశివ రావు, హ్యాండ్‌బాల్ అకాడమీ కోచ్ కె.నాగరాజు ముగింపు సభలో పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో విజేతల వివరాలిలా ఉన్నాయి.

11 ఏళ్లలోపు కేటగిరి: బాలికల సింగిల్స్‌లో బి.దివ్య, వర్షితలు ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలిచారు. బాలికల డబుల్స్‌లో జె.సాహిత్య, బి.దివ్య (తెనాలి) జంట ప్రథమ, కె.లాస్య, కె.తేజస్వి (తెనాలి) జోడీ ద్వితీయ బహుమతిని దక్కించుకున్నారు. బాలుర సింగిల్స్‌లో వి.నిషాంత్, ఎ.త్రిషాల్ రెడ్డి ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలిచారు. డబుల్స్‌లో ప్రథమ బహుమతిని దినేష్, నిషాంత్‌లు జోడీ గెలుచుకోగా, ద్వితీయ బహుమతిని త్రిషాల్ రెడ్డి, ప్రన్సు జంట దక్కించుకుంది.

13 ఏళ్లలోపు కేటగిరీ: బాలికల సింగిల్స్‌లోనూ బి.దివ్య ప్రథమ, వర్షిత ద్వితీయ బహుమతిని గెలిచారు. డబుల్స్‌లో బి.దివ్య, జె.సాహిత్య జోడీకి ప్రథమ, పూజాశ్రీ, టి.రోజీ జంటకు ద్వితీయ బహుమతి లభించాయి. బాలుర సింగిల్స్‌లో కె.చైతన్య ప్రథమ, షణ్ముఖ ఆదిత్య, డబుల్స్‌లో కె.చైతన్య, వి.నిషాంత్ జంట ప్రథమ, గీతేష్, షణ్ముఖ ఆదిత్య జోడీ ద్వితీయ బహుమతిని సాధించింది.



విజేతలకు బహుమతిని ప్రదానం చేస్తున్న మునగాల మోహన్‌శ్యాంప్రసాద్

15 ఏళ్లలోపు కేటగిరీ: బాలికల సింగిల్స్‌లో రమ్య, లోకేశ్వరిలు ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలిచారు. డబుల్స్‌లో రమ్య, యశ్విత జంట ప్రథమ, పూజాశ్రీ, వర్షితల జోడీకి ద్వితీయ బహుమతులను గెలిచారు. బాలుర సింగిల్స్‌లో కె.చైతన్య ప్రథమ, అరవింద్ ద్వితీయ బహుమతిని గెలిచారు. డబుల్స్‌లో కడపకు చెందిన పవన్-సాకేత్ జంట ప్రథమ, తెనాలికి చెందిన విజ్ఞాన్, జయిద్ జోడీ రెండో బహుమతిని సాధించారు.

17 ఏళ్ల కేటగిరీ: బాలికల సింగిల్స్‌లో లక్ష్మీపల్లవికి ప్రథమ బహుమతి, లోకేశ్వరికి ద్వితీయ బహుమతి లభించాయి. డబుల్స్‌లో లక్ష్మీపల్లవి, లోకేశ్వరి జంట విజేతగా నిలిచింది తెనాలికి చెందిన ప్రణవిదాస్, తేజశ్రీ జోడీకి రెండోస్థానం దక్కింది. బాలుర సింగిల్స్‌లో కడపకు చెందిన జస్వంత్ ప్రథమ, పవన్ ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- అత్తలూరులో గడప గడపకు మన ప్రభుత్వం

అమరావతి: గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. అత్తలూరు ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కాలనీలో సైడ్ కాలువల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్తలూరు గ్రామానికి వచ్చిన జల్‌జీవన్ మిషన్ నిధులతో ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్‌లు ఉచితంగా మంజూరు చేశామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. నవరత్నాలతో గ్రామంలో ప్రతి ఇంటికి సంక్షేమ వెలుగులు కురిసినట్లు చెప్పారు. గ్రామ సచివాలయాలతో ఇంటి ముందుకే పాలన తెచ్చారన్నారు. అన్నదాతలకు అన్నివేళలా అండగా నిలిచేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ.9 కోట్లతో అత్తలూరు చుట్టుపక్కల గ్రామాల్లో తారురోడ్లు నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య, ఎంపీపీ మేకల హనుమంతరావు, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, గ్రామ సర్పంచి బంకా సరోజిని, వైఎస్సార్ సీపీ నాయకులు మాదినేని హరిబాబు, మదమంచి సతీష్, సింగమనేని నరసయ్య, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, భవిరిశెట్టి హనుమంతరావు, చిలకా సాంబయ్య నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

ఓటరు జాబితా పక్కాగా సిద్ధం చేయాలి

- తహసీల్దార్ జియావుల్‌హక్
- 21 నుంచి ఇంటింటి సర్వే

క్రోసూరు: ఓటరు జాబితాను పక్కాగా సిద్ధం చేయాలని తహసీల్దార్ ఎండీ జియావుల్‌హక్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓల సమావేశం సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు బూత్‌లెవల్ అధికారులు వచ్చే 21 నుంచి ఓటర్ల జాబితాలో సవరణలపై ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని చెప్పారు. సవరణలు ఉంటే ఫారం 6,7,8 లను దరఖాస్తు చేయించాలని సూచించారు. ఓటరు డోర్ నంబర్, పేరు, తండ్రి, భర్త, లింగం, అడ్రస్ వివరాలు తప్పుగా ఉంటే ఫారం 8 దరఖాస్తు చేయించాలన్నారు. ఓటర్ ఐడీలో ఉన్న ఫొటో బ్లర్‌గా ఉన్నా, వేరే ఫొటోలున్నా, ఫొటో స్థానం ఖాళీగా ఉన్న సదరు అభ్యర్థి ఫొటో తిరిగి అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఓటరు మృతి చెందినా, కరోనా కాలంలో మృతి చెందిన ఓటర్లుంటే వారి ఇంటి సభ్యుల ద్వారా ఫారం 7 దాఖలు పరిచాలని వివరించారు. వందేళ్లు దాటిన వారుంటే సదరు ఓటరు వయసులో తేడాలుంటే ఫారం 8 పెట్టించి క్లియర్ చేసుకోవాలని సూచించారు. ఒకే ఇంట్లో 10 పైగా ఓట్లు ఉంటే బీఎల్వోలు తక్షణమే వాటిని గుర్తించి ఫారం 7 దాఖలు చేసుకోవాలన్నారు. ఒకే డోర్ నంబర్ కలిగిన అపార్ట్‌మెంట్‌లో ఎక్కువ ఓట్లు నమోదు చేసిన వాటిని బీఎల్వోలు కుటుంబాల వారిగా విడివిడిగా ఫారం 8 దాఖలు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితర అధికారులు ఓటర్ల జాబితాల సర్వే వివరాలు కోరినప్పుడు బీఎల్వోలు తయారు చేసుకున్న జాబితాలు అన్నీ సక్రమంగా ఉండే విధంగా సిద్ధం చేసుకోవాలని చెప్పారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ జియావుల్‌హక్

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థినికి అభినందనలు

సత్తెనపల్లి(ముప్పాళ్ల): పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 570 మార్కులు సాధించి ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిన సముద్రాల వైష్ణవిని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్తరామకృష్ణ, వైస్ చైర్మన్ చిల్లంచర్ల కల్యాణ్, ట్రెజరర్ బచ్చుసందీప్, దేవరపల్లికాశి, నేరెళ్ల నరేంద్ర, దొడ్ల తరుణ్, బవిరిశెట్టి హరి, దేవరపల్లి రాఘవ, శ్రీను పాల్గొన్నారు.

'చే'నేత'ను బలోపేతం చేయడమే లక్ష్యం

- లాటరీ విధానంలో మగ్గం షెడ్ల కేటాయింపు
- ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి కృషి చేయగా నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి మరింత అభివృద్ధి పరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప ఆవరణలో రూ.3.50 కోట్లతో నిర్మించిన మగ్గం షెడ్లను సోమవారం లాటరీ విధానంలో నేతన్నలకు కేటాయించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప సముదాయంలో మగ్గం షెడ్ల నిర్మాణం వైఎస్సార్ కాలంలో జరగాల్సి ఉండగా ఆయన అకాల మరణంతో వీలుపడ లేదన్నారు. నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తన తండ్రి వైఎస్సార్ ఆశయాన్ని నెరవేర్చి నేతన్నకు అండగా నిలబడటం అభినందనీయమన్నారు. మగ్గం షెడ్లలో 146 మంది నేతన్నలకు నేతన్న నేస్తం తప్పకుండా అందజేస్తామన్నారు. మగ్గం షెడ్లు పొందిన లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు మాత్రమే నేత నేయాలని, విక్రయించడం గానీ, అద్దెలకు ఇవ్వడం గానీ జరిగితే షెడ్లు రద్దు చేయడంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో నిర్మించాల్సిన మగ్గం షెడ్లు అనివార్య కారణాల వల్ల ఆగిపోయినా నేడు ఎమ్మెల్యే ఆర్కే చొరవ తీసుకుని మగ్గం షెడ్లు నిర్మించి కార్మికులకు అందజేయడం చేనేత పరిశ్రమ అభివృద్ధిపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని చాటిందన్నారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నేతన్నల అభివృద్ధి కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. రాష్ట్ర చరిత్రలో మగ్గం షెడ్లు నిర్మించి సొంత మగ్గం లేని కార్మికులకు ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ఏడీఏ వనజ, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్ పాల్గొన్నారు.



చేనేత కార్మికురాలితో లాటరీ తీయిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

ఏరువ ట్రస్ట్ దాతృత్వం అభినందనీయం

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఏరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ
- హాజరైన ఎంపీలు ఆళ్ల, లావు

గుంటూరు రూరల్: విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పెద్దపలకలూరులోని శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్ గ్రౌండ్స్‌లో ఏరువ కోటిరెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన నిరుపేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు సోమవారం పంపిణీ చేశారు. ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది 50 విద్యా సంస్థల నుంచి హాజరైన అన్ని తరగతులకు చెందిన 1600 మంది విద్యార్థులకు రూ.51లక్షల మేర ఉపకార వేతనాలు అందించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూనె ఉమామహేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఏటా ఉపకార వేతనాలు అందిస్తూ తన దాతృత్వాన్ని గొప్పగా చాటుకుంటున్న సాయిరామ్ పేరు 'సాయం'రామ్‌గా అభివర్ణించారు. స్కాలర్‌షిప్ చెక్కులను ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలసి మంత్రి అందజేశారు. ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ, ఉపకార వేతనాలతో నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఊతంగా నిలుస్తున్న ఏరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని ప్రశంసించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ట్రస్ట్‌తో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ట్రస్ట్ సూచించే పది మంది ఎంటెక్ విద్యార్థులకు ప్రతి సంవత్సరం తాను ఉచితంగా విద్యనందజేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులందరికీ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఉచితంగా నోట్ పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు ఏరువ సాయిరామ్, జగదీశ్వరి, శ్రీవేణి, శ్రీలలిత, వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర నాయకుడు పోలూరి వెంకటరెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, మల్లీశ్వరి, నూనె గంగాధరరెడ్డి, అనిల్, హనుమంతరావు పాల్గొన్నారు.



వేదికపై మంత్రి అంబటి రాంబాబు, ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు సాయిరామ్



స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఏరువ సాయిరామ్